# ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- జగిత్యాలలో అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పక్కన అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శుక్రవారం ఆయన కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని, తహసీల్దార్, ఎస్ఐ హాజరై ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టం అమలుకు కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. గాదెపల్లి పరిధిలో ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించారని, పరిరక్షించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు శాలువాలతో సన్మానించారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులకు ఐడీవోసీ వద్ద అదనపు కలెక్టర్ బీఎస్ లత ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు, విద్య, వైద్యం, సంక్షేమ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న సదుపాయాలను అదనపు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్**

మేడిపల్లి, ఏప్రిల్ 4: జగిత్యాలలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ బంగారు దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ నాయకులు రమేశ్, గంగనర్సయ్య, లక్ష్మణ్, తదితరులున్నారు.

## కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాల, ఏప్రిల్ 4: మహనీయుల జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ సాధన యాత్ర నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు సులోచన, చంద్రశేఖర్, ఎంఏ దరి, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

## వాతావరణ ప్రభావంపై సమీక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్తర తెలంగాణ మండల పరిశోధన, విస్తరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాతావరణ ప్రభావంపై శాస్త్రవేత్తలు వ్యవసాయాధికారులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ (రాజేంద్రనగర్) వాతావరణ శాఖ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ లీలా రాణి ప్రజెంటేషన్ రూపంలో 10 జిల్లాల వర్షపాతం, తేమతో పాటు పంటల సాగులో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ ఏకాద్రి మాట్లాడుతూ, విస్తరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. వరి, పత్తి, మక్క, సోయాచిక్కుడు, శనగలు, నువ్వు సాగులో పరిశోధన, విస్తరణ అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ బలరాం, సహ పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ శ్రీలత, వివిధ విభాగాల ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

కొడిమ్యాల, ఏప్రిల్ 4: అధికారులు సమన్వయంతో పని చేసి హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కొండగట్టులో హనుమాన్ చిన్న జయంత్యుత్సవాల నిర్వహణపై శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మేడపల్లి సత్యం మాట్లాడుతూ, ఈనెల 11 నుంచి నిర్వహించే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని, కోనేటిలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, డీపీవో మదన్ మోహన్, డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, తహసీల్దార్లు మునీందర్, రమేశ్, ఎంపీడీవోలు స్వాతి, స్వరూప, ఎంపీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


కొండగట్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం, అధికారులు

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల, ఏప్రిల్ 4: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు నిరసన, ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా తిరుపతినాయక్ మాట్లాడుతూ, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ స్కీం రూ. 9 వేలుగా నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, శంకర్, హరీశ్ పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

కోరుట్ల, ఏప్రిల్ 4: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదుల అసోసియేషన్ ఎన్నికల కోసం నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ముగిసినట్లు ఎన్నికల అధికారులు ముబీన్‌పాషా, వెంకటరమణామూర్తి, విజయ్ సాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవీ కోసం తోట ఆంజనేయులు, బైరి విజయ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవీకి కస్తూరి రమేశ్, అంబల్ల నాగ నిర్మల, ప్రధాన కార్యదర్శి పదవీకి సుతారి శ్రీనివాస్, కొంపల్లి సురేశ్, సహాయ కార్యదర్శి కోసం చింత సూర్యనారాయణ, చిలువేరి రాజశేఖర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవుల కోసం గంగాధర్, రాజశేఖర్, నరేందర్ నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. కోశాధికారిగా ప్రేమ్‌కుమార్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా ఫసియొద్దీన్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా సదాశివరాజు, సదానందనేత, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా శ్రావణ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఈనెల 7న నామినేషన్ల ఉపసంహరణ, 11న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## కల్లూరులో ఇసుక వేలం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 4: కల్లూరు గ్రామ శివారులో 20 ట్రిప్పుల (ట్రాక్టర్) ఇసుకకు అక్రమంగా నిల్వ చేయగా, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని శుక్రవారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ. 20 వేలకు దక్కించుకున్నాడు. కాగా, అక్రమంగా నిల్వ చేసిన ఇసుక ఎక్కువ ట్రిప్పులు ఉంటుందని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గొడవకు దిగారు. దీంతో వేలం పాట పొందిన వ్యక్తి పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని సముదాయించారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రాజేందర్ పేర్కొన్నారు.

## ఆయిల్ పాం సాగుపై అవగాహన

జగిత్యాల రూరల్/సారంగాపూర్, ఏప్రిల్ 4: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట, సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారులు వినీల, ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్ పాం సాగులో మెళకువలు, రైతుల సందేహాలు నివృత్తి చేశారు. ఆయిల్ పాం ప్రస్తుతం టన్ను ధర రూ. 21 వేలు ఉందని, ముమ్ముందు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వరికి బదులు ఆయిల్ పాం సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు నాగరాజు, వెంకటేశ్, హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్, జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ అన్వేష్, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా బోర్ వేశారని ఫిర్యాదు

పెగడపల్లి, ఏప్రిల్ 4: పెగడపల్లి మండలం నర్సింహునిపేట గ్రామ సమీపంలో ఓ ప్రార్థనా మందిరం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే అక్రమంగా బోర్ వేశారని గ్రామస్తులు శుక్రవారం ఆర్అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పక్కనే రాత్రికి రాత్రే బోర్ వేశారని, దీంతో వాహనదారులకు తీవ ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బోర్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కార్మికులకు యూనిఫాం అందజేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 4: జగిత్యాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందజేయాలని ఏఐటీయూసీ జగిత్యాల మున్సిపల్ గౌరవాధ్యక్షుడు మహేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 18 నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర సామగ్రి ఇవ్వడం లేదని మండిపడ్డారు.

## వక్ఫ్ బిల్లుపై ముస్లింల నిరసన

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తేవడం పట్ల మెట్‌పల్లి పట్టణంలో ముస్లింలు శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కజీ ఇంతేజామి కమిటీ పట్టణాధ్యక్షుడు అక్తర్‌జానీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ తమీజొద్దీన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ముఖీమ్, తదితరులు పాల్గొన్నారు.

## హెడ్‌మాస్టర్‌పై పోక్సో కేసు

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని కల్లెడ జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ గంగారెడ్డిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్‌మాస్టర్ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లా విద్యాధికారికి వినతి**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: కల్లెడ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంగారెడ్డి విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని తల్లిదండ్రులు కలెక్టరేట్‌లో జిల్లా విద్యాధికారి రాముకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థినులను కులం పేరు అడుగుతూ టచ్ చేస్తూ లైంగికంగా వేధిస్తున్నాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సందర్శన

సారంగాపూర్, ఏప్రిల్ 4: బీర్‌పూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్, జాతీయ నాణ్యతా భరోసా ప్రమాణాల టీం సభ్యులు ఆన్‌లైన్‌లో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, మండల వైద్యాధికారులు రాధ, నరేశ్, క్వాలిటీ మేనేజర్ నాగరాజ్, సీహెచ్‌వో కుద్దుస్, సూపర్‌వైజర్ కిశోర్ పవార్, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, రాజేందర్, మోహన్ రెడ్డి, జలజ, దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మల్యాల(కొడిమ్యాల), ఏప్రిల్ 4: మల్యాల మండలం బల్వంతాపూర్‌లోని కాశీనగర్ కాలనీకి చెందిన షేక్ బర్కత్ బీ (23) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ బర్కత్ బీ భర్త ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. కాగా, షేక్ బర్కత్ బీ వ్యక్తి గత సమాచారాన్ని గ్రామానికి చెందిన హుస్సేన్ వైరల్ చేశాడని సూసైడ్ నోట్ రాసి గురువారం అర్ధరాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. షేక్ బర్కత్ బీ అన్న సయ్యద్ అదాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, ఏప్రిల్ 4: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శుక్రవారం రూ. 14 లక్షల 61 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు గంగాధర్, రాజం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వార్షికోత్సవం

వెల్గటూర్, ఏప్రిల్ 4: ఎండపల్లి మండలం రాజారాంపల్లిలోని అక్షర హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఎల్లాల ఆశిరెడ్డి, అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంగ, గోమతి, సౌజన్య, సరిత, దామోదర్, జ్యోతి, లత, అంజలి, స్రవంతి, వినోజ, స్వరూప, అనూష, సుమలత పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాన్సర్‌పై హైదరాబాద్‌లోని ఉమెన్స్ కళాశాల విద్యార్థి దురిశెట్టి భావన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కేవీ సంతోష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ

కోరుట్ల రూరల్/కథలాపూర్, ఏప్రిల్ 4: కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొంతం రాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం భూషణరావుపేట, చింతకుంట, పెగ్గెర్ల, కథలాపూర్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజారెడ్డి, మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

మేడిపల్లి, ఏప్రిల్ 4: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జీర్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్ కుమార్ ముద్రించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర 2025 క్యాలెండర్‌ను శుక్రవారం మేడిపల్లి మండలం పోరుమల్లలో విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కుమార్, నాయకులు ఏనుగు రమేశ్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాట

మల్యాల(కొడిమ్యాల), ఏప్రిల్ 4: మల్యాల మేజర్ గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల 77 వేల 490 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం డైలీ మార్కెట్ నిర్వహణకు వేలం పాట నిర్వహించగా రూ. 3,26,500, అంగడిబజార్‌లోని వాటర్ ప్లాంట్ నిర్వహణకు రూ. 94,710, గ్రామ పంచాయతీ భవన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు రూ. 6,56,280 వచ్చినట్లు పేర్కొన్నారు.

## గర్భిణులకు సీమంతం

కథలాపూర్/సారంగాపూర్, ఏప్రిల్ 4: గర్భిణులు పౌష్ఠికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాది బేగం పేర్కొన్నారు. కథలాపూర్ మండలం చింతకుంట, దుంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యశోద, సునిత, గోదావరి, అమృత, స్వరూప పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం అర్పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం-2, 4లో గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్లు అంజలి, మార్త, తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 4: రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సెక్షన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈనెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడుతున్నామని నోటీసు అందించారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, జీవో నంబర్ 51 సవరించాలని, పాత పద్ధతిలోనే కేటగిరీల వారీగా విధులు నిర్వహించాలని, ఉద్యోగులందరీ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పుప్పాల శ్రీకాంత్, సులోచన, ఎంఏ దరి, గ్రామ పంచాయతీ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి, ఏప్రిల్ 4: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సుదవేని మల్లేశంగౌడ్, సుంకపాక దేవమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నాయకులు సురేశ్, అజీత్‌రావు, ప్రభాకర్, దాస్, భూమేశ్‌గౌడ్, రవీందర్‌రావు, ఆదిరెడ్డి, కృష్ణ, అజీమ్, రాకేశ్, దీపక్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన వైబ్రెన్స్-2025 సంబురాలు

జగిత్యాల, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వార్షిక సాంస్కృతిక మహోత్సవం వైబ్రెన్స్-2025 పేరిట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజిత రావు, చైర్‌పర్సన్ మంజుల రమాదేవి, డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్‌రావు, మౌనిక రావు, సుమన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్లకు సత్కారం

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 4: మెట్‌పల్లి మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం సాధించడంతో రాష్ట్ర స్థాయి అవార్డు రాగా, కమిషనర్ మోహన్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించారు. శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృషితోనే రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, రెవెన్యూ అధికారి మీర్జా అజ్మతుల్లాబేగ్, ఆర్ఐలు అక్షయ్, రాజేందర్, జేఏవో రమేశ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సీనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, ఏప్రిల్ 4: ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో 6వ స్థానం కైవసం చేసుకొని ఉత్తమ పురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌ను శుక్రవారం మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ క్రాంతి, బిల్ కలెక్టర్లు అశోక్, మారుతి, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

కోరుట్ల, ఏప్రిల్ 4: పట్టణంలో అంబేద్కర్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అంబేద్కర్ మాల యువజన సంఘం నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు నర్సయ్య, రాజిరెడ్డి, సంతోష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

కథలాపూర్, ఏప్రిల్ 4: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య పేర్కొన్నారు. మండలంలోని పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలు, ప్రతిజ్ఞ, సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం సందర్శన

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలోని వీక్లీ బజార్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా విద్యాధికారి రాము సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు అభ్యాసన అభివృద్ధి కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ మహేశ్, ఆర్పీలు, కోర్సు డైరెక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 4: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బత్తిని వెంకటయ్య(50) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గ్రామానికి చెందిన చెన్నమనేని గంగాధర్ వ్యవసాయ బావిలో మోటార్‌కు రిపేర్ చేయడానికి వెంకటయ్య బావిలోకి దిగాడు. మోటార్ పైపులు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. వెంకటయ్య భార్య బత్తిని లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు.

## టీపీసీసీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా ముఖేశ్ ఖన్నా

జగిత్యాల, ఏప్రిల్ 4: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా జగిత్యాలలోని చిలుకవాడకు చెందిన బోగోజీ ముఖేష్ ఖన్నాను నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ ఖన్నా మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధుల ఫిర్యాదులపై విచారణ

జగిత్యాల, ఏప్రిల్ 4: వయోవృద్ధులను నిరాదరిస్తున్న కొడుకులపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధుసూదన్‌కు పలువురు వృద్ధులు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఏవో తఫజుల్ హుస్సేన్ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, నాయకులు వెల్ముల ప్రకాశ్‌రావు, గౌరిశెట్టి విశ్వనాథం, ఎఫ్ఆర్వో కొండయ్య, వృద్ధుల సంరక్షణ విభాగం సహాయకురాలు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ నియామకాలు జరిగేలా కృషి చేస్తా

కొడిమ్యాల, ఏప్రిల్ 4: నాచుపల్లి జేఎన్టీయూలో ప్రాంగణ నియామకాలు జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, లైబ్రరీలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలో శుక్రవారం ఆయన యాదవ కులస్తులతో సంఘం సభ్యత్వం నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ముఖ్య సలహాదారు తొట్ల చిన్నయ్య, సభ్యులు అంకం శంకర్, చౌట్‌పల్లి అంజయ్య, లక్కం మహిపాల్, పోతారపు రమేశ్, గంట మనోజ్, ముక్కెర శ్రీను, నరేశ్, పోతారపు నాగరాజు, ముక్కెర రాజేశ్, బండారి రాజం, కొత్తూరి నవీన్, నరేందర్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 4: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వొదెల రామకృష్ణ ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో చలువ పందిళ్లు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో కృపాకర్, మిషన్ భగీరథ ఏఈ సాయి, ఏపీవో మమత, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి అభినందన

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: అగ్నివీర్ (ఆర్మీ)కు ఎంపికైన మెట్‌పల్లి పట్టణానికి చెందిన లోకిని ధనుష్‌ను శుక్రవారం సీఐ అనిల్‌కుమార్ శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అలాగే, ధనుష్‌కు శిక్షణ ఇచ్చిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఆల్ రౌండర్ గంగాధర్‌ను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఎస్ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.


## పేదల కండ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం

మేడిపల్లి, ఏప్రిల్ 4: పేదల కండ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పోరుమల్ల గ్రామంలోని రేషన్ షాపులో శుక్రవారం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అలాగే, పోరుమల్ల, గుండ్లపల్లి, తొంబర్‌రావుపేట గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఏనుగు రమేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

సారంగాపూర్, ఏప్రిల్ 4: అజాగ్రత్తగా వాహనం నడిపి 12 గొర్రెల మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానాతో పాటు బాధితుడికి రూ. లక్ష పరిహారం చెల్లించాలని శుక్రవారం న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన కసాది చంద్రయ్య ఫిబ్రవరి 2, 2017న తన గొర్రెలను మేపి సాయంత్రం ఇంటికి తీసుకువస్తున్నాడు. గ్రామ శివారులో క్వాలీస్ వాహనం ఢీకొట్టడంతో 12 గొర్రెలు మృతిచెందగా, మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. కసాది చంద్రయ్య సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ రణధీర్ క్వాలీస్ డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కోర్టు కానిస్టేబుల్ సురేశ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీ తమ వాదనలు వినిపించారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి శ్రీవినిల్ కుమార్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించడంతో పాటు బాధితుడికి రూ. లక్ష నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు.

## మానేరు పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


పట్టాలు అందుకున్న విద్యార్థులతో విద్యా సంస్థల అధినేత అనంతరెడ్డి

కొడిమ్యాల, ఏప్రిల్ 4: పూడూర్‌లోని మానేరు హైస్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేస్తూ మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సునీతారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు అనంతాచార్యులు, ప్రిన్సిపాల్ అశ్విన్‌రావు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి ఏర్పాట్లు చేయాలి

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 4: శ్రీరామనవమిని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. పట్టణంలోని కోదండ రామాలయం పరిసరాల్లో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. అలాగే, పట్టణంలోని ఆలయాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, నిజాం, అశోక్, నరేశ్, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
jobs Apply Now!
★Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931

PASSPORT LOST
★I, Kokkula Ramesh, S/o. Kokkula Mallesham, H.No. 11-2-7, B.Y. Nagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist, my Passport No. L2211280 Lost by travelling from my house to Busstand. If any one Find Please Call: 80081 56677.
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189